క్లుప్తంగా

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అధ్యాపకులతో ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు సోమవారం మలికిపురంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక వర ప్రసాద రావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్ ఉద్యోగుల విషయంలో కూడా మంచి నిర్ణయం తీసుకుని ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హామీ పట్ల కాంట్రాక్టు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. బి.ఎస్.నరశింహరావు, సీహెచ్‌వీ ప్రసాద్, పి.కుమార్‌రాజు, డీఎస్ఎన్ మూర్తి, జె.రాజబాబు, డీఎస్ఎన్ మూర్తి, కె.చంద్రరావు, జీవీవీ రమణ, ఎన్.రవి, పీఏ మంగతాయారు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.40 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈఓ సాయిబాబు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు మచిలీపట్నానికి చెందిన బయిరెడ్డి నాంచారయ్య, నిర్మలాదేవి దంపతులు సోమవారం రూ.40 వేల విరాళం అందించారు. దాతకు స్వామి వారి చిత్రపటం ఈఓ ఈఓ డి.సాయిబాబు అందజేశారు. ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పూడికతీత పనులు

అలమూరు: వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగి పొర్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలోని చెముడులంకలో మేజర్ డ్రైన్‌లో సోమవారం పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ తమ్మన శ్రీనివాసు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు ఈ డ్రైన్ పూడికతీత పనులు చేపట్టారు. మురుగు నీరు ఎప్పటికప్పుడు బయటకు పోయే విధంగా గ్రామస్తులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే వర్షాకాలం సీజన్ దృష్ట్యా అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా అనునిత్యం పారిశుధ్య చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి యు.రేణుక, మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట్రావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

అయినవిల్లి: సాకా చిన్నిబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత సాకా ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో అయినవిల్లి మండలంలో ముక్తేశ్వరంలో మొబైల్ వ్యాన్ ద్వారా మజ్జిగ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు ఉన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా రమ్యశైలజ

అంబాజీపేట: ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా రమ్యశైలజ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా వచ్చారు.

వివాహిత అదృశ్యం

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన గంధం శ్రీసత్య అనే వివాహిత అదృశ్యమైంది. స్థానిక ఎస్సై పీవీవీఎస్ఎన్ కథనం ప్రకారం, ఈ నెల 10వ తేదీ ఉదయం 9–10 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. పలుచోట్ల వెదికినప్పటికీ ఆమె ఆచూకీ తెలియక పోవడంతో భర్త సతీష్ రాయవరం పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరుపక్షాలపై కేసుల నమోదు

రాయవరం: పసలపూడి ఊటలంక వీధిలో ఇరుపక్షాలు దాడులు చేసుకున్న ఘటనపై సోమవారం కేసులు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఊటలంకవీధికి చెందిన వెంకయ్యరమణ, అదే ప్రాంతానికి చెందిన ఇసుకపల్లి మహేష్ కుటుంబాలకు మధ్య పాత గొడవలున్నాయి. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇరుపక్షాల వారు గొడవ పెట్టుకున్నారు. ఈ ఘటనలో ఇరుపక్షాల వారికి గాయాలు కాగా, రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంపై ఇరుపక్షాల వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

గ్రామీణులకు నాణ్యమైన వైద్యం

- పీహెచ్‌సీల్లో 63 రకాల వైద్య పరీక్షలు
- అందుబాటులో ల్యాబ్ టెక్నీషియన్లు
- రోగులకు తప్పిన ఆర్థిక భారం



పెదపళ్ల పీహెచ్‌సీలో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

అలమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ వైద్య సేవల్లో పెను మార్పులు సంభవించాయి. ప్రతి పీహెచ్‌సీలోనూ ఇద్దరు డాక్టర్లతో పాటు పూర్తిస్థాయిలో ఆరోగ్య సిబ్బందిని నియమించి వైద్య సేవలను వేగవంతం చేసింది. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగ నిర్ధారణ పరీక్షలు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజవర్గాల్లో ఉన్న 23 పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటికే శిక్షణ పొందిన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ జరిగింది. ఇప్పటికే లక్షలాది రూపాయల విలువైన ఆధునిక యంత్ర పరికరాలను జిల్లా వైద్యారోగ్యశాఖ సమకూర్చింది. ఒక్కొక్క పీహెచ్‌సీకి వైద్య పరీక్షల నిమిత్తం టీబీ ఆర్‌టీపీసీఆర్, సీబీసీ, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో తూతూమంత్రంగా కేవలం ఐదారు పరీక్షలకే పరిమితమైన పీహెచ్‌సీల్లో ఇప్పుడు దాదాపు 63 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ 140 రకాల మందులను అందజేస్తున్నారు.

తగ్గుతున్న ఆర్థిక భారం

పీహెచ్‌సీల్లో అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులోకి రావడం వల్ల సత్వర వైద్య సేవలను అందించడంతో పాటు రోగులకు ఆర్థిక భారం తగ్గుతుంది. గత ప్రభుత్వ హయాంలో రోగ నిర్ధారణ పరీక్షలకు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి గంటల తరబడి నిరీక్షించి పరీక్షలు చేయించుకోవలసి రావడంతో సమయం వృథా కావడంతో పాటు అనుకున్న సమయానికి రోగ నిర్ధారణ జరిగేది కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో అదనపు వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోకి రావడంతో సంబంధిత పీహెచ్‌సీల్లో సత్వరమే వైద్యసేవలు అందించి రోగ నిర్ధారణ చేసేందుకు వీలు కలుగుతోంది. దీనికితోడు గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా నెలకు రెండుసార్లు సమీప పీహెచ్‌సీ వైద్యాధికారులు గ్రామ సచివాయాలకు వెళ్లి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు.

పీహెచ్‌సీల్లో ఇలా..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గతంలో అందించిన బ్లడ్ సుగర్, బ్లడ్ యూరియా, రక్తపోటు, హిమోగ్లోబిన్, హెచ్‌ఐవీతో పాటు హైపటైటిస్–బి, డెంగీ, బ్లీడిం, క్లాటింగ్ టైమ్, థైరాయిడ్, పొటాషియం, క్లోరైడ్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ, టోటల్ సెల్ కౌంట్, సీరం సోడియం, తదితర 63 రకాల వైద్య పరీక్షలు ప్రతిరోజూ రోగులకు అందిస్తున్నారు. పెదపళ్ల పీహెచ్‌సీలో దాతలు సమకూర్చిన ఈసీజీ మెషీన్‌తో ప్రతి రోజూ హృద్రోగ వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్నారు.

ప్రైవేటు ల్యాబ్‌ల అవసరం లేకుండా..



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. గతంలో మాదిరిగా ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవలసిన ఆవసరం లేదు. పీహెచ్‌సీకి వచ్చిన వెంటనే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి సత్వరమే చికిత్సను ప్రారంభిస్తాం.

– పి.భవానీశంకర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెదపళ్ల

అధునాతన పరికరాలతో వైద్య పరీక్షలు



రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన అధునాతన పరికరాలతో రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు చేస్తున్నాం. దీనివల్ల రోగ నిర్ధారణ సత్వరమే జరుగుతుంది. మెరుగైన చికిత్సను అందించేందుకు వీలు కలుగుతుంది.

– పి.రాజా రమేష్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్, పెదపళ్ల

రామాలయానికి శంకుస్థాపన



కొబ్బరికాయ కొడుతున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: మండల పరిధిలోని బిళ్లకుర్రు శివారు నక్కావారిపేట గ్రామంలో సోమవారం రామాలయానికి శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో రామాలయం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ ఆలయ నిర్మాణానికి గ్రామస్తుడు నేతల రవికుమార్, ఆదిశ్రీ దంపతులు శంకుస్థాపన చేయగా ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు, కొత్తపేట పంచాయతీ సభ్యుడు బొక్కా లోకేష్ పాల్గొన్నారు.

17న పి.గన్నవరం మండల సమావేశం

పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అంబటి భూలక్ష్మి అధ్యక్షతన ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. సమస్యలపై చర్చించడానికి మండల పరిషత్ సభ్యులతో పాటు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన

సఖినేటిపల్లి: రాజోలు నియోజకవర్గంలో ప్రాధాన్యత క్రమంలో రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సఖినేటిపల్లి లంకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండు సచివాలయాల పరిధిలో రోడ్లకు రూ.40 లక్షలు మంజూరు అయ్యాయి. కాలనీ రోడ్డుకు, రాజులవారి మెరక రోడ్డుకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, వైస్ ఎంపీపీలు రాపాక దీవెనకుమారి, రుద్రరాజు చిన రాజా, ఎంపీటీసీ సభ్యుడు రుద్రరాజు వెంకట్రాజు, సఖినేటిపల్లి సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, నాయకులు రేపూరి ఏసు రాజా, కుసుమ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కిల్కారి సేవలపై అవగాహన సదస్సు

అలమూరు: మండలంలోని పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కిల్కారి సేవలపై వైద్యారోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు జరిగింది. వైద్యాధికారి పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు పి.ఉమ, పీవీ రమణారావు తదితరులు కిల్కారి అమలు తీరును వివరించారు. మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం పూర్తయ్యే వరకూ ఆరోగ్య సిబ్బంది వెన్నంటి ఉంటారన్నారు. ఫోన్ ద్వారా గర్భిణి యోగక్షేమాలు తెలుసుకుంటూ ప్రత్యేక చికిత్సను అందజేస్తామన్నారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం

మలికిపురం: ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేకం దినోత్సవాన్ని స్థానిక ఎంఎస్ఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వం ఎయిడెడ్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మలికిపురంలోని మురికివాడల వెంబడి తిరిగి బాలలను బడిబాట పట్టేలా అవగాహన కల్పించారు. వారికి పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటరు నక్కా రమేష్‌బాబు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు పెద్ద పీట

పలు పాఠశాలల్లో 'జగనన్న విద్యాకానుక' పంపిణీ



అంతర్వేదిపాలెంలో జగనన్న విద్యాకానుక కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక



ముక్తేశ్వరంలో విద్యాకానుక కిట్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యకు పెద్ద పీట వేసినట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. సోమవారం ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎన్.గణేశ్వరరావు అధ్యక్షతన ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారీబడులను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. పదో తరగతిలో పాఠశాలలో ఉన్నతమైన మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. సిరిపల్లి గ్రామ సర్పంచ్ కుడుపూడి శాంతావతి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, సిరిపల్లి ఎంపీటీసీ సభ్యుడు యడ్ల కిరణ్, పాఠశాల స్కూల్ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రూ.వేల కోట్ల వ్యయం

సఖినేటిపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థ కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం అంతర్వేదిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్కూల్లు తెరిచేనాటికి విద్యకు అవసరమయ్యే వాటిని విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చడం చారిత్రాత్మకం అని అన్నారు. సర్పంచ్ నల్లి లీలావతి, జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యులు మంద పాటి రత్నం, కోనపల్లి భవానీ, ఎంఈఓ నల్లి మనోహరం, హెచ్‌ఎం జిల్లెళ్ళ సుగుణ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా మన విద్యావిధానం

కొత్తపేట: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న విద్యా విధానాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి అన్నారు. సోమవారం పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా మండలంలో 'జగనన్న విద్యాకానుక' పంపిణీ కార్యక్రమాన్ని మండల పరిధిలోని అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారు ప్రారంభించారు. పలువురు బాలలకు వారు స్వయంగా స్కూల్ బ్యాగ్ తగిలించి, షూస్ తొడిగి, ఉన్నత విద్య ప్రాప్తిరస్తు అని ఆశీర్వదించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన సభకు హెచ్‌ఎం కె.అరుణశ్రీఅధ్యక్షత వహించారు. సభలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి, విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా ప్రోత్సాహక, పాఠశాల అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎనిమిదవ తరగతిలో అడుగుపెట్టే ఒక్కొక్కరికీ ట్యాబ్‌లు ఉచితంగా అందించారన్నారు. సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యుడు నేతల వెంకటలక్ష్మి, దూళి సూరిబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నామాడి రాజారత్నం, పర్సన్ పరమట సూర్యప్రకాశరావు, పీఎంసీ చైర్మన్ చప్పిడి సుబ్రహ్మణ్యం, పాఠశాల స్థల దాత కుటుంబ సభ్యుడు రెడ్డి మసేను, ఎంపీడీఓ ఇ. మహేశ్వరరావు పాల్గొన్నారు. మండలంలోని 10 గ్రామాల్లో ఎంపీపీ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యాకానుక పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మామిడికుదురు: కార్పొరేట్ కన్న మిన్నగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామని జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి ఆంజనేయులు పేర్కొన్నారు. మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్స్‌లో ఆయన సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా ప్రభుత్వ స్కూల్స్ రూపురేఖలు మార్చి వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, సర్పంచ్ గొస్ మొహిద్దీన్, ఎంపీటీసీ సభ్యుడు వర్ధినేని రాము, హెచ్‌ఎం సీహెచ్ నిరంజని, పీఎంసీ కమిటీ చైర్మన్ మట్టా వెంకటేష్ పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: అంబాజీపేట జెడ్పీహెచ్ స్కూల్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఎంఈఓ జె.కనకదుర్గ అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, హెచ్‌ఎం మోకా ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి

అలమూరు: రాష్ట్రంలో విద్యార్థులందరికీ పాఠశాలలు తెరచిన రోజే జగనన్న విద్యాకానుక కిట్లను అందజేసి సీఎం వైఎస్ జగన్ దేశానికి ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని చెముడులంకలోనున్న జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, ఆలమూరులో సర్పంచ్ నేలపూడి లావణ్య ఆధ్వర్యంలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఎంపీపీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న సుమారు ఆరువేల మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందజేశారు. ఎంఏఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సౌకర్యాలు కల్పిస్తున్నారని నగరం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నక్కా కృష్ణవేణి అన్నారు. పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం ఆమె విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంఈఓ కోన హెలీనా, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ బొండాడ నాగమణి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు పులపర్తి చినవెంకట లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జగనన్న విద్యాకానుక కార్యక్రమాన్ని స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. హెచ్‌ఎం కె.సువర్ణ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల స్థాయిలో జగనన్న విద్యా కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 4,852 మంది విద్యార్థులు ఈ లబ్ధి పొందుతున్నారని వారు చెప్పారు. ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, పీఎంసీ చైర్మన్లు చిర్ల కనికిరెడ్డి, గొలుగూరి సత్యనారాయణరెడ్డి, హెచ్‌ఎం సుబ్బరాజు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- లూటుకుర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం లూటుకుర్రులో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజల సంక్షేమం కోసమే అని పేర్కొన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా జగనన్న రాష్ట్రంలో పాలన చేస్తున్నారని కితాబిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనరు జక్కంపూడి వాసు, మండల ఎంపీటీసీ సభ్యుల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల చక్రపాణి, పార్టీ నేతలు తులా గోపాలకృష్ణ, మట్టపర్తి శివ, బర్రే చిట్టిబాబు పాల్గొన్నారు.

ఈదరాడ పంట కాలువ దుస్థితిపై అర్జీ



వ్యర్థాలతో నిండిపోయిన ఈదరాడ పంట కాలువ

మామిడికుదురు: ఒకవైపు ఆక్రమణలు, మరోవైపు వ్యర్థాలతో నిండిపోతున్న ఈదరాడ పంట కాలువ పరిస్థితిపై రైతులు సోమవారం స్పందనలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు అర్జీ అందజేశారు. పంట కాలువ పరిస్థితిని పరిశీలించాలని అభ్యర్థించారు. కాలువలోకి అనధికారికంగా ఏర్పాటు చేసిన డ్రైనేజ్ తూరల్ని తొలగించాలని, కాలువలో పూడికను తొలగించి సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పంట కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, డ్రైనేజ్ తూరల్ని తొలగించే దిశగా కార్యాచరణ చేపట్టాలని కోరారు. దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రైతులకు హామీ ఇచ్చారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



స్వామివారిని దర్శించుకున్న మంత్రి వేణు తదితరులు

కె.గంగవరం: మండల పరిధిలోని తాళ్లపోడులో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి, లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయం వద్ద వేదపండితుల ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 14వ తేదీన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ స్వామివారిని దర్శించుకున్నారు. ఎంపీపీ పంపన నాగమణి, కో ఆప్షన్ సభ్యులు కడలి విజయదుర్గా, సర్పంచ్ చప్పిడి శ్రీనివాసు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం శ్రీరామ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దాతలు దొంగల శ్రీధర్, సునీత దంపతులు, గెద్దాడ సుబ్రహ్మణ్యం, మంగాయమ్మ దంపతుల చేతుల మీదుగా దేవులపల్లి రంగారావు బ్రహ్మత్వంలో మందిర ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, శాసనమండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం, డాక్టర్ పితాని అన్నవరం, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు అంబటి తుకారం, కొత్తపల్లి అరుణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మూరి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. సంఘ పెద్దలు కుడుపూడి పెద్దరాముడు, టేకుమూడి రాంబాబు, పితాని సూరిబాబు, కడియాల గోవిందు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొలిక్కి వచ్చిన డంపింగ్‌యార్డు సమస్య

- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ తోట
- త్వరలో టిడ్కో ప్లాట్లు ఇస్తామని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: దశాబ్దాలుగా పట్టణాన్ని పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్య కొలిక్కి వచ్చినట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. స్థల సేకరణకు అడ్డంకులు తొలగి పోయాయని, త్వరలో ఆ ప్రక్రియ పూర్తి కానుందన్నారు. అలాగే రెండో విడత టిడ్కో ప్లాట్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన సోమవారం స్థానిక కౌన్సిల్ హాల్లో జరిగింది. సమావేశానికి ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరయ్యారు. రూ. 3.34 కోట్లతో స్థలసేకరణ చేసేందుకు అజెండాలో పేర్కొన్న అంశానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ప్రస్తుత డంపింగ్ యార్డును ఆనుకుని ఉన్న 2.75 ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు 2011లో మున్సిపాల్టీ రూ. 64 లక్షలు రెవెన్యూ శాఖకు జమ చేసిందన్నారు. అప్పటి మార్కెట్ విలువ మేరకు 2015లో మరో రూ.56 లక్షలు డిపాజిట్ చేసిందన్నారు. అయితే స్థల సేకరణకు వ్యతిరేకంగా స్థల యజమాని కోర్టును ఆశ్రయించి స్టే తీసుకు రావడంతో స్థల సేకరణ నిలిచిపోయిందన్నారు. స్థల యజమానితో మాట్లాడి స్టే ఉపసంహరింప చేయించామని ఎమ్మెల్సీ తోట తెలిపారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుత మార్కెట్ విలువ మేరకు రూ.3.34 కోట్లు చెల్లించేందుకు కలెక్టర్ నుంచి అనుమతి మంజూరు చేశారన్నారు. ఇప్పటికే ఆర్డీఓకు జమ చేసిన రూ. 1.2 కోట్లు పోను మిగిలిన రూ. 2.14 కోట్లు చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రెండో విడత టిడ్కో ప్లాట్లను లబ్ధిదారులకు ఎప్పుడు అప్పగిస్తారని ఎమ్మెల్యే వేగుళ్ల అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్సీ తోట స్పందించారు. ఆగస్టు నాటికి రాష్ట్రంలో 1.5 లక్షల ప్లాట్లు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారన్నారు.